క్లుప్తంగా

జేత్యాతండాలో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠకు హాజరైన భక్తులు

టేకులపల్లి: మండలంలోని చుక్కాలబోడు గ్రామ పంచాయతీ జేత్యాతండాలో బొడ్రాయి ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన యాగశాలల్లో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం 9.19 గంటలకు శ్రీరంగం అజయ్‌సాయిచక్రి ఆధ్వర్యంలో బొడ్రాయి, ముత్యాలమ్మ, రాణపోతురాజు విగ్రహాలను ప్రతిష్ఠించారు. రాత్రి మహాభూత బలిహరణ చేపట్టారు.

శ్మశానవాటిక స్థలం ఆక్రమణను అడ్డుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

జూలూరుపాడు: జూలూరుపాడులోని శ్మశాన వాటిక (ఖబరస్తాన్) స్థలం ఆక్రమణను ఆపాలని కోరుతూ జమా మజీద్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ శారదకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఎస్కే సిద్ధిక్, మస్తాన్, అయూబ్, బోలేమియా, ఎస్కే నాగుల్‌మీరా, చాంద్‌పాషా, జానీ, అక్బర్, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

'శ్రీరాగా'లో స్నాతకోత్సవం



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: మేదరబస్తీలోని శ్రీరాగా ప్లే స్కూల్‌లో సోమవారం కేజీ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రియదర్శిని డిగ్రీ, పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ నయీం హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఫ్యాన్సీ డ్రెస్‌లు అలరించాయి. కార్యక్రమంలో టీవీ రమణ, గోపీనాథ్, వరప్రసాద్, కవిత, మధుసూదన్, అంకీనీడు ప్రసాద్, రాంబాబు, సర్వేశ్వరరావు, రాజు, వాసు, సైమన్, రాధిక, కీర్తి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో ఆడిట్‌పై సమీక్ష

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో సోమవారం రీజియన్ ఆడిట్ కమిటీ సమావేశం నిర్వహించారు. గనులు, డిపార్టుమెంట్లలో చేపట్టిన తనిఖీలు, రూపొందించిన ఆడిట్ నివేదికలపై అధికారులతో చర్చించారు. పి.శ్రీనివాసు, మల్లారపు మల్లయ్య, జీవీ మోహన్‌రావు, రామచంద్ర, యూసఫ్, ధనుంజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసు నమోదు

సుజాతనగర్: మండలంలోని సీతంపేటబంజర గ్రామానికి చెందిన బాదావత్ కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఠాణాలో ముగ్గురిపై కేసు నమోదైంది. ఎస్‌ఐ పి.తిరుపతిరావు కథనం మేరకు.. సుజాతనగర్ మండలం సీతంపేటబంజర గ్రామానికి చెందిన బాదావత్ శివకు, కొణిజర్ల మండలం మేకాలకుంటకు చెందిన కృష్ణవేణితో 12 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.5 లక్షల నగదు, 8 తులాల బంగారం పెట్టారు. అయితే, ఆ బంగారాన్ని తాకట్టుపెట్టిన శివ కుటుంబ సభ్యులు.. అదనపు కట్నం కోసం కృష్ణవేణిని వేధిస్తున్నారు. దీంతో భర్త శివ, అతని తమ్ముడు శ్రీహరి, అత్త బిక్కిపై కృష్ణవేణి ఫిర్యాదు చేయగా.. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొనసాగుతున్న దీక్షలు

జూలూరుపాడు: ఇనామ్ భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వెంగన్నపాలెం గ్రామానికి చెందిన దళితులు జూలూరుపాడులో చేపట్టిన నిరహారదీక్షకు సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు యాతంగి రమణయ్య, గుర్రం నాగమణి సంఘీభావం తెలిపారు.

కార్మికుల ఇబ్బందులు

టేకులపల్లి: నాలుగు నెలల నుంచి జీపీ కార్మికులు జీతాలు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుబాకుల ప్రసాద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. నిత్యావసర ధరలకు అనుగుణంగా వారి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

రోడ్లు నాణ్యంగా ఉంటాయా?

- సీసీ రోడ్ల నిర్మాణంలో నిబంధనలు గాలికి..
- నిర్మించిన ఏడాదికే తేలుతున్న కంకర
- మట్టిలో కలిసిపోతున్న నిధులు
- పకడ్బందీ పర్యవేక్షణతోనే ప్రయోజనం



రెండేళ్ల కిందట ఇందిరానగర్‌లో వేసిన సీసీ రోడ్డు కంకర తేలిన దృశ్యం

ఇల్లెందురూరల్: గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగి నాలుగేళ్లు కావొస్తుండగా గతంలో ఎన్నడూ లేనివిధంగా పాలకవర్గాల పదవీ కాలం ముగిసే సమయాన పలు పథకాల పేరుతో పెద్దమొత్తంలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు పోటెత్తుతున్నాయి. గతంలో అరకొరగా మంజూరైన నిధులతో వేసిన రోడ్లు ఏడాది కాలంలోనే కంకర తేలి వెక్కిరిస్తున్నాయి. ప్రస్తుతం పెద్దమొత్తంలో నిధులు మంజూరవుతున్న నేపథ్యాన గతంలో మాదిరిగానే నిర్మాణం చేపడితే నిధులన్నీ మట్టిపాలయ్యే ప్రమాదం లేకపోలేదు. అధికారులు స్పందించి పర్యవేక్షిస్తే సీసీ రహదారులు పది కాలాలు మన్నే అవకాశం ఉంది.

తాజాగా రూ.9.40 కోట్లు మంజూరు

మండలంలో పల్లె రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద రూ.2 కోట్లు, డీఎంఎఫ్ పథకం ద్వారా రూ.4.50 కోట్లు, ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.2.90 కోట్లను మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు వేసేందుకు కేటాయించింది. అందులో డీఎంఎఫ్, ఎస్‌డీఎఫ్ పథకం పనులు ప్రారంభం కాకపోగా, ఈ నెల 31లోగా పూర్తి చేయాలనే నిబంధనతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైన పనులు చేపడుతున్నారు.

మార్గదర్శకాలు ఇలా..

గ్రామాల్లో సీసీ రోడ్లు పదికాలాల పాటు మన్నికగా ఉండేలా ఇంజనీరింగ్ శాఖ నిబంధనలు జారీ చేసింది. రోడ్డు వేయడానికి ముందు నేలంతా చదును చేసి రోలింగ్ చేశాక ఒక బొచ్చ సిమెంట్, 1.5 బొచ్చెల ఇసుక, మూడు బొచ్చల కంకర మిశ్రమంతో రోడ్డు నిర్మించాలి. అలాగే, 50 కిలోల సిమెంట్ బస్తాకు 20 లీటర్ల నీరు వినియోగిస్తూ 12.4 అంగుళాల వెడల్పు, ఏడు అంగుళాల మందంతో రోడ్డు వేసి 28 రోజులపాటు క్రమం తప్పకుండా క్యూరింగ్ చేయాలి. అలాగే, పాతకాలనీల్లో ప్రస్తుతం ఉన్న రహదారి ఆధారంగా ఇళ్లు నిర్మించినందున సీసీ రోడ్డు వేసే క్రమంలో రహదారిని కొంత మేర తవ్వాలి. కానీ ఈ నిబంధనలేమీ కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదు. నిబంధనలకు అనుగుణంగా ఇసుక, కంకర, సిమెంట్ మిశ్రమం చేయకపోగా.. సిమెంట్ కూడా తగ్గించేస్తున్నారు. అలాగే, క్యూరింగ్ కూడా చేయకపోవడంతో సీసీ రోడ్లు మూన్నాళ్ల ముచ్చటగా మిగులుతున్నాయి. కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తుండగా.. సంబంధిత అధికారులు సైతం పర్యవేక్షించకపోవడం విమర్శలకు తావిస్తోంది. కాగా, ప్రతీ రోడ్డు పూర్తయ్యాక నాణ్యతా తనిఖీ విభాగం అధికారులు క్యూబ్‌లను సేకరించి నాణ్యతను పరీక్షించాక అంతా సక్రమమేనని భావిస్తే బిల్లు మంజూరుకు సిఫారసు చేయాలి. కానీ, అలా జరగకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

నిబంధనలు పాటించేలా దృష్టి



సీసీ రోడ్ల నిర్మాణంలో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటాం. కాంక్రీట్ మిశ్రమం సమపాళ్లలో ఉండేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తాం. 28 రోజులపాటు క్యూరింగ్ చేసేలా ఆదేశాలు ఇస్తాం. నాణ్యత విభాగం సిఫారసుల మేరకే బిల్లులు మంజూరు చేస్తాం.

–రాజు, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ, ఇల్లెందు మండలం

కలెక్టరేట్ ఎదుట పలు సంఘాల ధర్నా



నినాదాలు చేస్తున్న ఎన్డీ నాయకులు



ధర్నా చేస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

కలెక్టరేట్ ఎదుట పలు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఏళ్లుగా ఎదుర్కొంటున్న తమ సమస్యలు పరిష్కరించాలని నినదించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

ఎన్డీ ఆధ్వర్యంలో..

సూపర్‌బజార్(కొత్తగూడెం): అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని, ఐకేపీ రుణాలు రద్దు చేయాలని, వరద ముంపు బాధితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు వీరమల్ల ఉమ అధ్యక్షతన జరిగిన సభలో న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు మాట్లాడారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్డీ నాయకులు గౌని నాగేశ్వరరావు, వాగబోయిన రామక్క, మోకాళ్ల కృష్ణ, సంతు, సరోజిని, కృష్ణవేణి, చింత రజిత, శ్రీను, బండ్ల వెంకటేశ్వర్లు, వైఎస్ రెడ్డి, పాడుగు నరసింహారావు, ఆర్.లక్ష్మి, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేశ్ మాట్లాడుతూ పెంచిన వేతనాలు, 10 నెలల ఏరియర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె.సత్య, డి.వీరన్న, ఎస్కే సుల్తానా, రామలక్ష్మి, కె.చిలకమ్మ, సావిత్రి, సరిత, జ్యోత్స్న, జ్యోతి పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో..

డాక్టర్ ప్రీతి కేసులో నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తూ కేసును నీరు గారుస్తున్నారని ఆరోపిస్తూ ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్‌నాయక్ మాట్లాడుతూ ప్రీతి కేసును హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జ్యుడీషియల్ విచారణ జరిపించాలని కోరారు. ఈ నెల 18న చలో వరంగల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ కన్వీనర్ వాసం రామకృష్ణదొర, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంతుల్యానాయక్, మోహన్‌నాయక్, కేశవ్‌నాయక్, చెన్నారావు, అనిల్‌నాయక్, శంకర్‌సాధు, సురేశ్ పాల్గొన్నారు.

వీఓఏల ఆధ్వర్యంలో..

డీఆర్‌డీఓ పరిధిలో పనిచేస్తున్న వీఓఏ(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్)ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు దాసం లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే సఫియా పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



ఇల్లెందు: విజేతలతో మున్సిపల్ చైర్మన్ డీవీ



పాల్వంచ: సుదీక్షను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఇల్లెందు: స్థానిక సుమన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ పోటీలలో కటాస్ విభాగంలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డీవీ, ఎస్‌ఐ రాజేశ్, ఆర్గనైజర్ భానుప్రసాద్, జల్లెల శ్రీనివాసరావు, అబ్దుల్ నబీ, పీవీ కృష్ణారావు, మెరుగు కార్తీక్‌యాదవ్, సుమన్, సతీశ్, ఆర్కె, పాదిలి శ్యాం తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ డీపీవీ విద్యార్థిని ప్రతిభ

పాల్వంచ: ఈ నెల 12వ తేదీన ఖమ్మంలో జరిగిన జాతీయ డబ్ల్యూఎస్‌కేఓ కరాటే చాంపియన్‌షిప్-2023లో పాల్వంచ డీపీవీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 1వ తరగతి చదువుతున్న విద్యార్థిని పి.సుదీక్ష వైట్ బెల్ట్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. పాఠశాల హెచ్‌ఎం ఎ.రామారావు, ఎ.శ్యాం, రవికుమార్, రామస్వామిదాస్ తదితరులు అభినందించారు.

పురస్కార గ్రహీతలకు సన్మానం



కృష్ణవేణిని సన్మానిస్తున్న కలెక్టర్



జ్యోతిని సత్కరిస్తున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న రాష్ట్ర ప్రభుత్వం నుంచి విశిష్ట మహిళా పురస్కారాలు పొందిన అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, ఆశావర్కర్ కృష్ణవేణిని కలెక్టర్ అనుదీప్ సోమవారం ఐడీఓసీలో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంకితభావంతో సేవలు చేసి జిల్లాకు గుర్తింపు తెచ్చారని, మారుమూల ప్రాంత ప్రజలకు అమూల్యమైన సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ శిరీష, జిల్లా సంక్షేమాధికారి లెనీనా పాల్గొన్నారు.

తుదిశ్వాస వరకూ కమ్యూనిస్టుగానే..



నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా (ఇన్‌సెట్) జక్కుల కొమురయ్య(ఫైల్)

ఇల్లెందు: తుది శ్వాస వరకు కమ్యూనిస్టుగా నిబద్ధతతో పనిచేసిన జక్కుల కొమురయ్య ఆశయ సాధనకు కృషచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా పేర్కొన్నారు. సీపీఐ సీనియర్ నాయకుడు జక్కుల కొమరయ్య (95) సోమవారం కన్నుమూశారు. ఈ సందర్భంగా ఇల్లెందులోని కొమురయ్య స్వగృహంలో ఆయన మృతదేహంపై పార్టీ పతాకం కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించినవారిలో సీపీఐ నాయకులు మిర్యాల రంగయ్య, కె.సారయ్య, ఏపూరి బ్రహ్మం, గట్టయ్య, వాసిరెడ్డి సీతారామయ్య, దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, గుగులోతు కృష్ణ, టి.సుధాకర్, కుమ్మరి రవీందర్, ఎండీ నజీర్ అహ్మద్, వంగ వెంకట్, ఎస్వీ రమణ, రాజారామ్, టి.వెంకటేశ్వరరావు, సాయిరి రాజేశ్వరరావు, గాలీబ్ సాహెబ్, బొల్లి కొమురయ్య, టి.వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, సీతారాములు, మున్సిపల్ చైర్మన్ డీవీ ఉన్నారు.

ఇళ్లు నిర్మించకుండానే ఎంపిక ఎలా?



పనులు పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): పాత కొత్తగూడెంలో ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తి కాకుండానే లబ్ధిదారులను ఎలా ఎంపిక చేశారని సీపీఎం సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరం కనకయ్య ప్రశ్నించారు. సోమవారం వారు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి మాట్లాడారు. డ్రాలో వచ్చిన లబ్ధిదారులకు మొండిగోడల ఇళ్లు ఇస్తారా? అని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఇళ్లు నాసిరకంగా ఉన్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో లిక్కి బాలరాజు, భూక్య రమేశ్, డి.వీరన్న, లక్ష్మి, బుర్ర వీరభద్రం, జునుమాల వంశీ, నాగకృష్ణ, ముత్తేజ్, వెంకన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని తెలగ రామవరం అటవీ ప్రాంతంలో సోమవారం పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఎనిమిది మందిని అరెస్ట్ చేసి, రూ.46 వేల నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో 12 మంది పరారయ్యారని ఎస్‌ఐ ప్రవీణ్ తెలిపారు. హేమచంద్రపురానికి చెందిన గజ్జి లింగమూర్తి పేకాట స్థావరం నడిపిస్తుండగా పలువురుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మక్కువ పెంచుకోవాలి

పాల్వంచ: క్రీడలపై యువత మక్కువ పెంచుకుని ఎదగాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్ అన్నారు. సాయినగర్ యూత్ ఆధ్వర్యంలో ఉబ్బపల్లి రమేశ్ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు సోమవారం ఆయన బహుమతులు అందించారు. విజేతగా జడ్ బ్రోస్ జట్టు.. ద్వితీయ స్థానంలో చర్చి బజార్ స్టార్ సిక్సర్స్ జట్టు నిలిచింది. కార్యక్రమంలో వీరస్వామి, లక్ష్మి, కంచర్ల రామారావు, రవి, వంశీ, సంపత్, ప్రవీణ్, అశోక్, కృష్ణ, శామ్యూల్, పవన్, శేషగిరి, శేఖర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'అయ్యప్ప సమితి' మండల అధ్యక్షుడిగా బలరాముడు

టేకులపల్లి: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి మండలాధ్యక్షుడిగా బోడు గ్రామానికి చెందిన గురుస్వామి మిట్టపల్లి బలరాముడు, ప్రధాన కార్యదర్శిగా టేకులపల్లికి చెందిన ధరావత్ లాలునాయక్ ఎన్నికయ్యారు. సోమవారం వారు వివరాలు వెల్లడించారు. సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గుత్తా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భద్రాచలంలో జరిగిన సమావేశంలో టేకులపల్లి మండల కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు.

రెన్యూవల్ చేసుకోవాలి

పాల్వంచ: కోఆపరేటివ్ సొసైటీల ద్వారా స్వల్పకాలిక రుణాలు పొందిన రైతులు 7 శాతం వడ్డీని చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సొసైటీ కార్యాలయంలో సోమవారం పాలక మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రెన్యూవల్ చేయించుకోని రైతులు 13 శాతం వడ్డీని చెల్లించాల్సి ఉంటుందన్నారు. కాంపెల్లి కనకేశ్, కనగాల నారాయణరావు, సామ జనార్దన్‌రెడ్డి, పాపారావు, సీతారాంబాబు, మైనేని వెంకటేశ్వరరావు, కిషన్, వెంకటరమణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టెన్నిస్ పోటీల్లో ప్రతిభ

పాల్వంచ: ఈ నెల 12న కొత్తగూడెం సింగరేణి ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి లాన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పాల్వంచ క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. 45 సంవత్సరాలు పైబడిన విభాగంలో జి.యుగంధర్ రెడ్డి, అన్నం వెంకటేశ్వర్లు, 35 సంవత్సరాలు పైబడిన విభాగంలో కబీర్, లక్ష్మణ్ చాంపియన్‌గా నిలిచారు. వీరికి సింగరేణి ఆస్పత్రి సీఎంఓ వెంకటేశ్వరరావు, యుగంధర్‌రెడ్డి, జకరియా, నాగభూషణం, జయబాబు బహుమతులు అందజేశారు.

పోడు పట్టాలివ్వాలి

ఇల్లెందు: పేదలు సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని ఎన్డీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. సోమవారం ఇల్లెందులోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు



కొత్తగూడెంఅర్బన్: కేక్ తినిపిస్తున్న సీతాలక్ష్మి



సింగరేణి(కొత్తగూడెం): సెంట్రల్ వర్క్‌షాపులో..



పాల్వంచ: కేక్ తినిపిస్తున్న రాజుగౌడ్



ఇల్లెందు: కేక్ కట్ చేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టినరోజు వేడుకలను మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం జ్యోతి వృద్ధాశ్రమంలో నిర్వహించారు. తొలుత చైర్‌పర్సన్ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. వృద్ధులకు అన్నదానం చేసి, బియ్యం, కొంత నగదు అందజేశారు. కాపు కృష్ణ, వేముల ప్రసాద్, కొండ స్వామి, పరమేశ్‌యాదవ్, సూరిబాబు, మాజిద్, నాగేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం ఏరియాలో..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా, కార్పొరేట్ ఏరియా పరిధిలో నిర్వహించిన ఆయా వేడుకల్లో రజాక్, సోమిరెడ్డి, కాపు కృష్ణ, కూసన వీరభద్రయ్య, శ్రీనివాస్, చిలక రాజయ్య, ఎండీ గౌస్, చెరిపెల్లి నాగరాజు, బోరింగ్ శంకర్ పాల్గొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచ: పాల్వంచలో నిర్వహించిన వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు మంతపురి రాజుగౌడ్, మాధవి, లత, మంజుల, పద్మ, అపర్ణ, లక్ష్మీ, శేష సాయి, నళిని, లక్ష్మీ, ఉష తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో..

ఇల్లెందు: ఇల్లెందులో నిర్వహించిన వేడుకల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎస్.రంగనాథ్, కళ్లం కోటిరెడ్డి, సంజీవరావు, జి.వెంకటేశ్వర్లు, చంద్ర వెంకటేశ్వర్లు, ఎస్‌వీఎస్ఎన్ రాజు, భూక్యా నాగేశ్వరరావు, దరియాసింగ్, హరిసింగ్, ఆవుల శ్రీనివాస్, రమేశ్, శ్రీనివాసరెడ్డి, మంగపతిరావు, సర్వం, సాంబయ్య, అశోక్, సతీశ్, అజీజ్, బుచ్చిరెడ్డి, చేరాలు, చంద్రశేఖర్, బాలాజీ, గోపీసింగ్, గౌస్, వెంకటేశ్వర్లు, రాజు, రామ్‌శంకర్, లక్ష్మణ్‌రావు, రవిశంకర్, మధు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై బీజేపీ నిర్లక్ష్యం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న భిక్షపతి

జూలూరుపాడు: ఎస్సీ వర్గీకరణపై బీజేపీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్రా భిక్షపతి అన్నారు. ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన మాదిగల సంగ్రామ యాత్ర సోమవారం జూలూరుపాడుకు చేరుకుంది. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ ఏప్రిల్ 4న జరిగే హైదరాబాద్ ముట్టడికి మాదిగలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపూరి వెంకటేశ్వర్లు, కనకం రవి, ఇసనపల్లి అశోక్, తోళ్ల సురేశ్, చెంగల గురునాథం, గార్లపాటి రాంబాబు, చెంగల నరసింహారావు, గార్లపాటి కృష్ణ, సురేశ్ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పూడుకుపోయిన కాలువ

మండలంలోని బాలాజీనగర్ గ్రామ పంచాయతీ పరిధి సంజయ్‌నగర్‌లో ప్రధాన మురుగు కాల్వ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో మూసుకుపోయింది. ఇందులో నీరు ప్రవహించే పరిస్థితి లేకపోవడంతో ఏటా వర్షాకాలంలో వరద వచ్చినప్పుడు నీరు సమీపంలోని ఇళ్లలోకి చేరుతోంది. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి వేసవిలోనే కాల్వను బాగు చేసి రానున్న వర్షాకాలంలో ఇబ్బంది ఎదురుకాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

–ఇల్లెందురూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : నీలిమ, గ్రామపంచాయతీ కార్యదర్శి, బాలాజీనగర్
సెల్ నంబర్ : 93469 31114